క్లుప్తంగా...

సేవాభావంతో ముందుకెళ్లాలి



సమావేశంలో పాల్గొన్న గవర్నర్

లాలాపేట: సమాజహితం కోసం జనహిత సేవా ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ అన్నారు.శనివారం తార్నాకలోని మర్రి కృష్ణ ఫంక్షన్ హాల్లో జరిగిన జనహిత సేవా ట్రస్టు వార్షిక లబ్ధిదారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకెళ్లాలన్నారు. సమాజ సేవ చేస్తున్న వారికి తోచిన విధంగా సహాయం అందించి ప్రోత్సాహించాలన్నారు. జనహిత సేవ ట్రస్టు నిర్వాహకులు నర్సింహ మూర్తి మాట్లాడుతూ.. కరోనా విపత్కర పరిస్థితుల్లో ట్రస్టు ద్వారా వేలాది మందికి సేవలందించామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, కృష్ణారెడ్డి, విశ్వనాథ్, డాక్టర్ హరి అనుపమా పాల్గొన్నారు.

క్రికెట్ విజేత టీఎస్‌యూ జట్టు



విజేతగా నిలిచిన జట్టును అభినందిస్తున్న పోలీసు అధికారి

ఉస్మానియా యూనివర్సిటీ: మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో టీఎస్‌యూ జట్టు విజేతగా నిలువగా విజన్ 60 ఎమ్మెల్యే జట్టు ద్వితియ స్థానంలో నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్‌లో గెలుపొందిన టీఎస్‌యూ జట్టును పోలీస్ అధికారి అభినందించారు. ఈ నెల 4 నుంచి 15 వరకు జరిగిన క్రికెట్ పోటీలలో 36 టీంలు పాల్గొన్నట్లు నిర్వహకులు కృష్ణ తెలిపారు.

సమస్యలపై దృష్టి సారించాలి



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సరళ

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్‌లో కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కేతినేని సరళ సూచించారు. వివిధ శాఖల అధికారులతో శనివారం ఎస్ఆర్‌నగర్ లైబ్రరీ పార్కులో సమావేశమయ్యారు.ప్రజల ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం సరిగా జరగడం లేదని, కొన్ని చోట్ల కలుషితనీరు వస్తున్న కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పార్కులు నిర్వహణ సరిగా లేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు హర్షిణి, సందీప్,మురళీధర్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న నాయకులు

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని బీజేపీ నేత రాజలక్ష్మీఆనంద్ అన్నారు. ఎస్పీరోడ్డులోని సింధికాలనీలో గత 15 రోజులుగా డ్రైనేజీ పొంగుతుందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. గురువారం రాజలక్ష్మీఆనంద్, నెమలి ఆనంద్ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సందీప్ వర్మ, రోషన్‌లాల్, దీపక్, మహారాజ్, కిషోర్, చరణ్ పాల్గొన్నారు.

పేదల హక్కుల కోసం పోరాడుదాం



పుస్తకాల పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ స్ఫూర్తితో పేదల హక్కుల కోసం పోరాడుతామని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. శనివారం బీఆర్ఎస్వీ, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట కేక్‌కట్ చేసి ఆంజనేయగౌడ్ జన్మదిన వేడుకలను నిర్వహించి విద్యార్థులకు చట్టం, న్యాయం అనే పుస్తకాలను న్యాయవాది మహేష్ ఉచితంగా అందజేశారు.

రూ. 14.56 కోట్లు కేటాయించినా

మురుగు సమస్యకు లేదు మోక్షం!

- అస్తవ్యస్తంగా 'గాంధీ'డ్రైనేజీ వ్యవస్థ
- టెండర్లకు ముందుకురాని వైనం
- దుర్గంధంగా సెల్లార్



మురుగుతో నిండిన సెల్లార్

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మార్పు చేసి మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆరునెలల క్రితం రూ. 14.56 కోట్ల నిధులు కేటాయించింది. తెలంగాణ వైద్య విద్య సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో నాలుగు మార్లు టెండర్లకు ఆహ్వానించినా ఒక్క టెండరు కూడా దాఖలు కాకపోవడంతో సంబంధిత అధికారులు ఖంగుతిన్నారు. అంచనా విలువ (ఎస్టిమేట్) నివేదికల్లో చేర్పులు మార్పులు మరోమారు టెండర్లను ఆహ్వానించేందుకు సమాయత్తం అవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ పనులు పూర్తయితే సెల్లార్‌లో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వస్తుంది. మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం కలుగుతుంది.

పై అంతస్తుల నుంచి లీకేజీలు..

సుమారు రెండు దశాబ్దాల క్రితం గాంధీ ఆస్పత్రి ఇన్ పేషెంట్ విభాగం భవనాన్ని సెల్లార్ జీ ప్లస్ ఎనిమిది అంతస్తుల్లో నిర్మించారు. భవనంలో 712 మరుగుదొడ్లు ఉండగా, అంతకు ఐదింతలు మంచి నీటి పైప్‌లైన్ నల్లాలు ఉన్నాయి. అప్పటి అవసరాలు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. ఆయా విభాగాల నుంచి వచ్చే మురుగు నీరు సెల్లార్ నుంచి పైప్‌లైన్లు ద్వారా బయటకు తరలించడం ఇంజనీరింగ్ తప్పిదంగా సంబంధిత నిపుణులు భావిస్తున్నారు. రోగుల సంఖ్య గణనీయంగా పెరగడం, పైప్‌లైన్లు చిన్నవి కావడం, ఎలుకలు, పంది కొక్కులు తవ్వేయడం, పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరి మురుగు సమస్య ఉత్పన్నమైంది. ఏడాది పొడవునా సెల్లార్ మొత్తం మురుగు నీటితోనే నిండి ఉంటుంది. పై అంతస్తుల నుంచి లీకేజీ రూపంలో నిరంతరం నీళ్లు కారడంతో ఆపరేషన్ థియేటర్లలో సర్జరీలు వాయిదా పడిన సందర్భాలు ఉన్నాయి.

రాజారావు కృషితో నిధులు మంజూరు..

డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు గతంలో పలుమార్లు రూపొందించిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుత సూపరింటెండెంట్ రాజారావు కృషి ఫలితంగా ఆరునెలల క్రితం వైద్యమంత్రి హరీష్ రావు నిధులు కేటాయించారు. గాంధీ సెల్లార్‌లో డైట్ క్యాంటీన్, మెడికల్ ఫార్మసీ, ఫిజియోథెరపీ, సెంట్రల్ స్టెరిలైజేషన్ డిపార్ట్‌మెంట్, లాండ్రీ, ఎలక్ట్రికల్, లోకల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజీ తదితర విభాగాలు నిత్యం మురుగునీటిలోనే కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లను నూతనంగా నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న 300 డయాగ్రం పైప్‌లైన్ల స్థానంలో రెండింతల పెద్దవి ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఎలాంటి అవాంతరాలు కలగకుండా మురుగు సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు బ్లూప్రింట్‌ను రూపొందించారు.

ఆరునెలల్లో నాలుగుసార్లు టెండర్లు..

ఎనిమిది అంతస్తుల్లో ప్రతి ఫ్లోర్ పైప్‌లైన్లకు ప్రత్యేక వాల్వ్ ఏర్పాటు చేసి, డ్రైనేజీ వ్యవస్థను ఎక్కడికక్కడ నియంత్రిస్తారు. సిమ్మెంట్, ఇటుక గోడల్లోకి ప్రత్యేకంగా రూపొందించిన రసాయన మిశ్రమాలను పంపించి లీకేజీలను నివారిస్తారు. అన్ని డ్రైనేజీ పైప్‌లైన్లు గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే కలిసేలా వ్యవస్థను ఏర్పాటు చేసి, అక్కడి నుంచే జీహెచ్ఎంసీ మెయిన్ డ్రైనేజీకి కలుపుతారు. దీంతో సెల్లార్‌లో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వస్తుందని ఇంజనీరింగ్ నిపుణుల అంచనా. ఈమేరకు గత ఆరునెలల్లో నాలుగుసార్లు టెండర్లకు ఆహ్వానించినా నిర్మాణదారులు ముందుకురాకపోవడం గమనార్హం. నియమ నిబంధనలను కొంతమేర సడలించి మరోమారు టెండర్లు పిలిచేందుకు టీఎస్ఎంఎస్ఐడీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లాం..



నిధులు కేటాయించినప్పటికీ టెండర్‌దారులు ముందుకు రాకపోవడంతో మురుగు సమస్య పరిష్కారంలో జాప్యం నెలకొంది. ఈ విషయాన్ని వైద్యమంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. మరోమారు టెండర్లను ఆహ్వానించి నెలరోజుల్లో పనులు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించారు. గాంధీలో మంజూరైన సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి, ఆయా విభాగాల నుంచి వచ్చే మురుగు నీటిని ఎస్‌టీపీకి తరలించి, శుద్ధి చేసి జీహెచ్ఎంసీ డ్రైయిన్‌లోకి మళ్లించేలా ప్రణాళికలు రూపొందించాం.

– ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

రెండో రాజధాని సాధన కోసం ఉద్యమిస్తాం

లాలాపేట: హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్‌తో కలిసి ఉద్యమిస్తామని ప్రొ. గాలి వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1955లో అంబేడ్కర్ మొదటి రాష్ట్రాల విభజన కమిషన్‌కు లేఖ రాస్తూ ఉత్తరాదికి ఢిల్లీ, దక్షిణాదికి హైదరాబాద్‌ను దేశ రాజధానులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారన్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక సందర్భాల్లో అనేక రూపాల్లో ఈ డిమాండ్‌ను వ్యక్తపరుస్తున్నా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు దక్షిణాది ప్రాంతాన్ని దగా చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఓట్ల కోసమే అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నాయని ఆరోపించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరిబీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 20, దొండ 21, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 50, మొరంగడ్డ 16, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తాం



మసీదు కమిటీ సభ్యులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

మంత్రి తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: పవిత్ర రంజాన్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో రంజాన్ ఏర్పాట్లు, గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందుల ఏర్పాట్లపై శనివారం ఆయన సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మసీదు కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఇప్పటికే గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ దాదాపుగా పూర్తయ్యిందని ఇఫ్తార్ విందు ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహణ జరిగేలా చూస్తామన్నారు. మసీదుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రంజాన్ పండుగను ముస్లింలు ఎంతో సంతోషంగా జరుపుకునేలా ఏర్పాట్లు చేస్తుందన్నారు. పేదలు సైతం పండుగను గొప్పగా జరుపుకోవాలనే ఆలోచనతో దుస్తులను అందజేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పవన్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌యాదవ్, వెంకటేష్, రాజు, నాగులు, జయరాజ్, శ్రీహరి, శేఖర్, ఫహీం, నోమాన్, రజాక్, ఖలీల్, అఖిల్, అబ్బాస్, ఫాజిల్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం



రంజాన్ కానుకలను అందజేస్తున్న పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం కల్పిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. డివిజన్‌లోని ఎల్ఎన్ నగర్, అంబర్ నగర్ మసీదుల్లో శనివారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ముస్లింలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో 15 మసీదులకు రంజాన్ కానుకలతో పాటు, ఇఫ్తార్ విందుల కోసం నిధులను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ, నేతలు రామేశ్వర్‌గౌడ్, కంది నారాయణ పాల్గొన్నారు.

సనత్‌నగర్ జాఫ్రీ మసీదు వద్ద..

సనత్‌నగర్: పండుగల విశిష్టతను ప్రపంచానికి చాటుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాల పండుగలు ఆనందంగా నిర్వహించుకునేలా ప్రతియేటా కానుకలను పంపిణీ చేస్తోందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ జాఫ్రీ మసీదు వద్ద శనివారం కార్పొరేటర్ ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకే అన్ని పండుగలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ.. పండుగ ఏదైనా వారందరూ సంతోషంగా జరుపుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు.ఈ కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, సరఫ్ సంతోష్, ఖలీల్‌బేగ్, జమీర్, అబ్రార్, వాసీం, జాఫ్రీ పాల్గొన్నారు.



రంజాన్ తోఫాలను అందజేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో..

సనత్‌నగర్: అన్ని వర్గాల సంతోషమే బీఆర్ఎస్ లక్ష్యమని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. డివిజన్ పరిధిలోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో శనివారం ముస్లింలకు రంజాన్ తోఫాలను అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వాలు పండుగల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని కేసీఆర్ సర్కార్ ప్రతియేటా అన్ని మతాల పండుగలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ నిరుపేదలకు కొత్త దుస్తులను కానుకగా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అడ్డగుట్ట: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్ వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన మోసిన్ పటేల్(23), రమేష్ చారి(22) శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అడ్డగుట్ట నుంచి 5.30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న స్టీఫెన్, తుకారాంగేట్ పోలీసులతో కలిసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు.



ఓయూ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు చేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారాసిగూడలోని ఓల్డ్ పోస్టాఫీస్ లేన్‌లోని సుజాత ఐ కేర్ సెంటర్‌లో ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగే కంటి పరీక్షలకు విద్యార్థులు గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు.

ఘనంగా 'విషు' వేడుకలు

సనత్‌నగర్: కేరళ సంవత్సరాది 'విషు'ను తమిళ, కేరళీయులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ఆవరణలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకులు నండూరి సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఇంటికి చేరిన కొత్త పంట, ఫలాలను ముందుగా అయ్యప్పస్వామికి నివేదించటం విషు ఉత్సవ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. అయ్యప్ప దేవాలయంలో స్వామివారిని ప్రతిష్టించి, కొత్తగా వచ్చిన పంట, ఫలాలను, నవధాన్యాలు, పూలు, ద్రవ్యాన్ని స్వామివారికి నివేదించటం జరిగిన తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన అద్దంలో స్వామివారిని చూసేలా ఏర్పాట్లు చేశారు. వేడుకలో ఆలయ ఈవో శ్రీనివాస్‌రాజు, భక్తులు సురేష్ చౌదరి, శ్రీహరి, తమిళ, కేరళీయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సురేష్‌కు దళితరత్న అవార్డు



కొండ సురేష్ కుమార్‌ను సత్కరిస్తున్న సుదర్శన్ బాబు, అశోక్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్‌కు చెందిన కొండ సురేష్ కుమార్‌ను ప్రభుత్వం దళిత అవార్డుతో సత్కరించింది. సామాజిక సేవాభివృద్ధి కార్యక్రమాల ద్వారా సమాజహితం కోసం పాటుపడే వారికి ప్రతి ఏటా ప్రభుత్వం డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ జయంత్యుత్సవాల సందర్భంగా సత్కరిస్తారు. ఈ కార్యక్రమంలో మేడి పాపయ్య మాదిగ, సుదర్శన్‌బాబు, మహేందర్, అశోక్, మహేందర్ పాల్గొన్నారు.

పూలే దంపతుల 150 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

లిబర్టీ: సామాజిక విప్లవకారుడు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన జ్యోతిరావుపూలే దంపతుల 150 అడుగుల విగ్రహాన్ని తెలంగాణ ప్రభుత్వం నగర నడిబొడ్డులో ఏర్పాటు చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాన్ని ధారపోసిన సామాజిక సంస్కర్త పూలే అని ఆయన అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రధానంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన తరహాలోనే హైదరాబాద్ మహానగరంలోని ప్రధాన కూడలిలో సామాజిక విప్లవ యోధుడు పూలే దంపతుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి దేశానికి 70 కోట్ల మంది బీసీల ఆదరణ పొందాలని సూచించారు.

వస్త్ర ప్రదర్శన ఏర్పాటు అభినందనీయం



రసూల్‌పురా: మహిళా సాధికారతతో పాటు మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ తెలంగాణ జాయింట్ డైరెక్టర్ ఇందుమతి అన్నారు. బొల్లారం సరస్‌నగర్‌లో రెండు రోజుల పాటు జరిగే చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం ఆమె హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దయాల్ బాగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన దుస్తుల డిజైనింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ పూర్వ విద్యార్థులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు ఇలాంటి వస్త్ర ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయన్నారు. టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ద్వారా విద్యార్థులు తమ వస్త్ర ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు పీపుల్స్‌ప్లాజాలో జరిగే జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. దయాల్ బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ హ్యాండి క్రాఫ్ట్స్ టెక్నికల్ ట్రెనింగ్ ప్రొఫెసర్ పరుల్ భట్నాగర్, ఎస్వీ. రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, దక్షిణ మూర్తి పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం



విజేత జట్టుకుట్రోఫీ అందజేస్తున్న సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగుల కోసం నిర్వహించిన అంబేడ్కర్ కప్‌ను అడ్మిన్ జట్టు కైవసం చేసుకుంది. కెప్టెన్ సీఈఓ మధుకర్ నాయక్ కప్‌ను బృందం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ క్రీడాకారులకు పుట్టినిల్లుగా బాసిల్లిందన్నారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ పరిధిలో క్రీడలకు మరింత ప్రాధాన్యమిస్తూ పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ సైతం టోర్నమెంట్‌కు హాజరై కాసేపు సరదాగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు అఫ్జల్, ఉమాశంకర్, మహేందర్, రాజ్ కుమార్, రమణ పాల్గొన్నారు.

డెకర్, గిఫ్ట్ రంగానికి ఉజ్వల భవిష్యత్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ప్రతాప్ జడేజా

కంటోన్మెంట్: డెకర్, గిఫ్ట్ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని రాష్ట్ర కేటరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ జడేజా అన్నారు. ఈ రంగంలో పేరెన్నిక కలిగిన 'సన్‌రైజ్ ది గిఫ్ట్ వరల్డ్' నూతన ఫ్రాంచైజీని శ్రీ బాలాజీ ట్రేడింగ్ ఆధ్వర్యంలో కార్ఖానాలో ఏర్పాటు చేశారు. సన్‌రైజ్ డెకర్ అండ్ గిఫ్ట్స్ సీఈఓ అనుపమ్ రైనాతో కలిసి ప్రతాప్ జడేజా నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే రెండేళ్లలో భారతీయ గిఫ్టింగ్ మార్కెట్ 159 మిలియన్ డాలర్లకు చేరే అవకాశముందన్నారు. ఇటీవల డెకరేషన్, గిఫ్టింగ్ సంస్కృతి విస్తృతం అవుతోందన్నారు. సన్‌రైజ్ సంస్థ బాలాజీ ట్రేడింగ్ ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల్లోనూ తమ ఫ్రాంచైజీలు ప్రారంభిస్తూ ఉండటం అభినందనీయమన్నారు. కేటరింగ్ రంగంలోనూ వినూత్న పద్ధతులు మనుగడలోకి వచ్చాయన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాగటి సత్యం

బన్సీలాల్‌పేట్: అట్టడుగు వర్గాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి ఆర్థిక పురోభివృద్ధికి చేయూత ఇవ్వాడానికే డిక్కా సంస్థను ఏర్పాటు చేసినట్లు సంస్థ చైర్మన్ రాగటి సత్యం అన్నారు. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్‌లో సంస్థ కార్యాయలంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాలు ఆయా రంగాల్లో ఎదగడానికి వీలుగా వారి ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో నిశ్చయ కార్యాచరణ వాణిజ్య మండలి(డిక్కా) పేరుతో సంస్థను రిజిస్టర్ చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలు ఆ వర్గాలు సద్వినియోగం చేసుకునేలా వారికి సలహాలు, సూచనలు ఇచ్చి తీర్చిదిద్దుతామన్నారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ అణగారిన వర్గాలను అన్ని విధాలా ఆర్థిక చేయూత ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాగటి భవానీ కుమార్, డాక్టర్ శివకుమార్ లాల్, జి. నర్సింగ్‌రావు, బి. కృష్ణంరాజు, కె. గాంధీకుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభించిన శ్రీ గణేష్

రసూల్‌పురా: గత పన్నెండేళ్లుగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు తమ శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు శ్రీ గణేష్ తెలిపారు. తిరుమలగిరి టీచర్స్ కాలనీలో కాలనీ అధ్యక్షులు భిక్షపతి రెడ్డి అభ్యర్థన మేరకు శనివారం శ్రీ గణేష్ చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా కనీసం ముప్పై నుంచి నలభై వరకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భిక్షపతి రెడ్డి, శ్రీనివాస రెడ్డి, నారాయణ, ఆనంద్, మంజు భార్గవి, హన్మంత్ రెడ్డి, మాధవరావు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.